# గులాబీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- ప్రతికార్యకర్త సైనికుల్లా పనిచేయాలి
- ఇక్కడ గెలిచిన ఈటల తట్టెడు మట్టైనా పోసిండా?
- బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆరే
- హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, అక్టోబర్ 25: బీఆర్ఎస్‌కు కార్యకర్తలే పట్టుగొమ్మలని, వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాట ఇచ్చారు. హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ₹వెయ్యి కోట్లు ఇస్తానని మాటిచ్చారని, రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి చేయకుంటే మరోసారి ఓటు అడుగనన్నారు. సాదుకుంటరో.. సంపుకుంటరో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన జమ్మికుంట పట్టణంలో పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని 11, 12, 16, 22, 30వ వార్డుల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మూడోసారి సీఎంగా కేసీఆర్ ఖాయమని, ఇక్కడ కూడా బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతున్నదని తెలిపారు. స్వరాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా.. అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలన్నా.. బీఆర్ఎస్‌నే గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. 24గంటల ఉచిత కరెంటు సరఫరా దేశంలో ఎక్కడా లేదన్నారు. రైతు బీమా, రైతు బంధు, పింఛన్లు, ధాన్యం కొనుగోళ్లు, కేసీఆర్ కిట్లు, గురుకులాలు, కార్పొరేట్‌కు దీటుగా వైద్యం, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ ఒక్కరేనన్నారు. గత ఉపఎన్నికలో ఇక్కడ గెలిచిన ఈటల రాజేందర్ తట్టెడు మట్టైనా పోసిండా చెప్పాలన్నారు. పనిచేయని నాయకుడెవరో ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలు పరిష్కరిస్తున్న నాయకుడెవరో మీరే గుర్తించాలని కోరారు. రెండేళ్లుగా మీ బిడ్డలెక్క మీ మధ్య తిరుగుతున్నానని గుర్తు చేశారు. మీ ఇంటి బిడ్డగా పని చేస్తున్నానని, మీరే నా కుటుంబసభ్యులుగా భావిస్తున్నానని చెప్పారు. అభ్యర్థిగా ప్రకటించి సీఎం ఆశీర్వదించారని, మీరు ఆదరిస్తే అసెంబ్లీలో అడుగు పెడతానని పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నాకోటి, కౌన్సిలర్లు బిట్ల కళావతి, కుతాడి రాజయ్య, గుల్లి మొగిలి, మద్ది లావణ్య, నాయకుడు మొలుగు దిలీప్, ఆయా వార్డు అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొప్పులకే మా మద్దతు



వెల్గటూరులో మంత్రి ఈశ్వర్‌ను కలిసి మద్దతు ప్రకటన చేస్తున్న మాదిగ సంఘ నాయకులు

- ధర్మపురి నియోజకవర్గ మాదిగ సంఘం నాయకులు
- వెల్గటూరులో మంత్రి ఈశ్వర్‌ను కలిసి సంఘీభావం

ధర్మారం,అక్టోబర్ 24: ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు నియోజకవర్గంలోని మాదిగ సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కొప్పుల ఈశ్వర్‌ను మాదిగ సంఘం, మాదిగ ఐక్య వేదిక ముఖ్య నాయకులు బొల్లి నందం, పెర్క బాణేష్, సుంచు మల్లేశం, ఇరుగురాల నర్సయ్య, చొప్పదండి మల్లేశం, రామగిరి మల్లేశం, ఆవునూరి శ్రీకాంత్, తడగొండ రమేశ్, సుద్దాల అరవింద్, కుశనపల్లి రవి, చెవులమద్ది శ్రీనివాస్ తదితర నాయకులు కలిశారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పార్టీని ఓడగొట్టేందుకు తమవంతు ప్రయత్నిస్తామని తేల్చిచెప్పారు. దళితుల ఆర్థికాభివృద్ధికి ప్రవేశ పెట్టిన 'దళిత బంధు' ప్రదాత సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# హస్తం పార్టీకి ఓటేస్తే చేటే

- పేదలకు బీఆర్ఎస్ అండ
- అన్నదాతల సంక్షేమానికి పెద్ద పీట
- సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్
- జంగపల్లిలో ప్రజా ఆశీర్వాద సభ
- జనసంద్రమైన పల్లె



గన్నేరువరం : జంగపల్లి ప్రజా ఆశీర్వాద సభలో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్

గన్నేరువరం, అక్టోబర్ 25: కాంగ్రెస్‌వి భరోసా లేని పథకాలని, పగటి వేషాలు వేస్తూ ప్రజలను మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజానీకానికి అండగా నిలిచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నదాతల సంక్షేమానికి పెద్ద పీట వేశామని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. మండలంలోని జంగపెల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మానకొండూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ హాజరయ్యారు. కాగా బతుకమ్మలు, బోనాలతో మహిళలు ఘన స్వాగతం పలికారు. రసమయి మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడారు. కాంగ్రెస్ అసమర్థ పాలనకు కర్ణాటకలో తలెత్తుతున్న పరిస్థితులే తాజా నిదర్శనమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను బుట్ట దాఖలు చేయడం, ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం కాంగ్రెస్, బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కర్ణాటకలో పంటలు ఎండిపోతున్నప్పటికీ అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని వాగ్దానం ఇచ్చి... బస్సుల్లో పురుషులు మాత్రమే ప్రయాణించాలని బోర్డులు పెట్టడంపై మండిపడ్డారు. తెలంగాణ ముందు రైతులు పొలాలను బీళ్లు పెట్టి గల్ఫ్ దేశాలు, ముంబాయి, భీవండి, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు బతుకుతెరువు కోసం వలస వెళ్లే వారని వాపోయారు. రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. నెర్రెలు బారిన నేలకు ఎర్రటి ఎండలో కూడా సాగునీళ్లు అందించారని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ₹200 పింఛన్ ఉండేదని, కేసీఆర్ సీఎం అయ్యాక దివ్యాంగులకు ₹4016, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ₹2016 ఇస్తున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్ ₹6016, ఆసరా పింఛన్ ₹5016 చేస్తామని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం ఎకరాకు ₹6వేలు చేస్తామని, ప్రతి కుటుంబానికి రైతుబీమా మాదిరిగా ₹5లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా ఆశీర్వాద సభలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచ్ అటికం శారద శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మోహన్ రెడ్డి, గుడెల్లి ఆంజనేయులు, మన్మోహన్ రావు, మహేందర్ రెడ్డి, వెంకట రమణరెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష

- కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులు ఎక్కువ.. ఓట్లు తక్కువ
- రాహుల్ గాంధీ పర్యటన అట్టర్ ప్లాప్
- చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- మధురానగర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



మధురానగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 25: నియోజకవర్గంలో ఇప్పటికీ కాంగ్రెస్‌కు అభ్యర్థి ఖరారు కాలేదని, ఆ పార్టీలో ఉండేది కుర్చీల కొట్లాటలే కానీ ప్రజా సంక్షేమం కాదని చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థులు ఎక్కువ, వాళ్లకు వచ్చే ఓట్లు తక్కువని ఎద్దేవా చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాహుల్‌గాంధీ పర్యటన అట్టర్ ప్లాప్ అయ్యిందని, పట్టుమని 500 మంది కూడా లేరని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మధురానగర్‌లో బీఆర్ఎస్ మండల కార్యాలయాన్ని సుంకె రవిశంకర్ ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావును సీట్లో కూర్చోబెట్టి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన రాహుల్‌గాంధీకి రోడ్లపై దోశలు వేయడానికి సమయం దొరికింది కానీ భక్తుల కొంగు బంగారం కొండగట్టు అంజన్నను దర్శించుకోవడానికి సమయం లేదని సుంకె రవిశంకర్ ఎద్దేవా చేశారు. అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, ఆకలి చావులే ఉన్నాయని గుర్తు చేశారు. ఐదు గ్యారెంటీలతో కర్నాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. ₹400 ఉన్న సిలిండర్ ధరను ₹1200 చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదని, ఆ పార్టీలు అధికారంలోకి వస్తే పేదలను కొట్టి పెద్దలకు పెడతారన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణకు శ్రీరామ రక్ష అని, మాట ఇచ్చి మడమ తిప్పని నాయకుడు కేసీఆర్ అని, బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేసి తీరుతారని స్పష్టం చేశారు. చొప్పదండి నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఓటు వేస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎంపీపీ శ్రీరాం మధుకర్, జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలగౌడ్, వెలిచాల తిర్మల్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, వైస్ చైర్మన్లు వేముల భాస్కర్, సామంతుల శ్రీనివాస్, సర్పంచులు వేముల లావణ్యఅంజి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, కంకణాల విజేందర్‌రెడ్డి, దోర్నాల హన్మంతరెడ్డి, ముక్కెర మల్లేశం, ఆకుల శంకరయ్య, జోగు లక్ష్మీరాజం, ఎండీ నజీర్, ఎంపీటీసీలు అట్ల రాజిరెడ్డి, ద్యావ మధుసూదన్‌రెడ్డి, నా యకులు రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, వంగల మల్లికార్జున్, ఆకుల మధుసూదన్, అట్ల శేఖర్‌రెడ్డి, తోట మహిపాల్, పంజాల ఆంజనేయులు, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, సుంకె అనిల్, ఇరుగురాల రవి, పెంచాల చందు, మామాడిపెల్లి అఖిల్ గంగాధర సంపత్ పాల్గొన్నారు.